క్లుప్తంగా

వైభవంగా మావుళ్లమ్మ తీర్థం



సిద్ధాంతం మావుళ్లమ్మ తీర్థ మహోత్సవానికి హాజరైన భక్తులు

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ తీర్థ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతర మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉదయం నుంచి భక్తులు మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. మావుళ్లమ్మ ఫెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు. తీర్థ మహోత్సవానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా హాజరయ్యారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

పాలకొల్లు సెంట్రల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మానవతావాదం అతి ముఖ్యమైన అంశమని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రామ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో భారతీయ స్టేట్ బ్యాంక్ 70 వసంతాలు సందర్భంగా రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌బిఐ 70 వసంతాలు సందర్భంగా జూన్ నెల సేవా మాసంగా ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా పాలకొల్లు బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. రక్తదానం చేసిన 25 మంది సభ్యులకు రెడ్‌క్రాస్ సంస్థ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ చంద్రకృష్ణ, రామకృష్ణ, మెహర్‌బాబా, రాము, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 173 మంది ఎంపిక



పెనుగొండలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులు

పెనుగొండ: పెనుగొండ విశ్వతేజ డిగ్రీ కళాశాలలో 1ఎం1బీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 173 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కళాశాల ఆవరణలో 12 ప్రముఖ కంపెనీల ప్రజా ప్రతినిధులు హాజరు కాగా 285 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా మేనేజరు జాన్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పెనుమంట్ర: మార్టేరు బాసంతి దేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను పెనుమంట్ర మండల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గురువారం సాయంత్రం పాఠశాల ఆవరణలో నగదుతో సత్కరించారు. 564 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానం పొందిన కె.నాగవెంకటసాయికి రూ.10 వేలు, ద్వితీయస్థానం పొందిన కె.సాయిశతికి రూ.6 వేలు, తృతీయ స్థానం పొందిన డి.పూర్ణారెడ్డికి రూ 3 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పడాల జగన్నాథ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిర్ల నరసింహారెడ్డి, ప్రెసిడెంట్ చిర్ల కనకిరెడ్డి, నర్సాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

భీమవరం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులో రాణించాలని డీఎన్నార్ పాలక వర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. గురువారం డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసే వారిని ప్రజలు ఉపేక్షించరాదన్నారు. యువత మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పనిచేస్తూ, ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ, వాటి నివారణకు నడుం బిగించి మాదక ద్రవ్యాల రహిత సమాజానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. మోజెస్, సహాయ కార్యదర్శి ఆర్.రామకృష్ణంరాజు, వివిధ విభాగాల శాఖాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల గోడు వినేదెవరు?

నాలుగు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు



నాలుగో రోజు అర్ధనగ్న ప్రదర్శనలో మునిసిపల్ అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులు

పాలకొల్లు సెంట్రల్: నాడు అధికారంలోకి రావడానికి అడిగిన వారికి అడగని వారికి ఇష్టానుసారంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు హామీలు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరకాలం పూర్తయ్యింది. ఈ సంవత్సరంలో రాష్ట్రంలో ఏ ఒక్కరికీ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయింది. తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలంటూ ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు గత నాలుగు రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ ఫలాలు అందిస్తానని ఇచ్చిన హామీని ఇంతవరకూ నెరవేర్చలేదు. ఇంజనీరింగ్ ఉద్యోగుల తమ న్యాయపరమైన కోర్కెలు తీర్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు. నిరాహారదీక్షల్లో ఇంజనీరింగ్ విభాగాల్లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్ వర్క్స్ ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్స్, అవుట్‌డోర్ వర్కర్స్, వాల్ ఆపరేటర్స్ ఇలా అన్ని విభాగాలకు సంబంధించిన కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కారమయ్యేవరకూ సమ్మె ఆపేదే లేదని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

కార్మికుల కొరత

ప్రస్తుతం పట్టణంలో ఇంజనీరింగ్‌కు సంబంధించిన వాటర్‌వర్క్స్‌లో ఇన్‌డోర్, అవుట్‌డోర్, వీధి లైట్లు, ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు, వాల్స్ విప్పడం, ఫిల్టర్ బెడ్స్ బ్లీచింగ్ వేయడం, హలం కలపడం వంటి అనేక పనులు చేయాల్సి ఉంటుంది. మొత్తం పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో పర్మినెంట్ ఉద్యోగులు పది మంది ఉంటే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు 28 మంది ఉన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొత్తం సమ్మెలో ఉండడంతో పర్మినెంట్ ఉద్యోగులతోనే ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో పనులు నెట్టుకుంటూ వస్తున్నారు. పట్టణంలో ప్రజలకు ఈ పది మందితో పూర్తిస్థాయిలో న్యాయం చేయగలరా అంటే కష్టంగానే అనిపిస్తుంది. సమ్మెలో ఉన్న కొందరిని అదిరించి బెదిరించి పనులు చేయించుకోవడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.

అర్ధనగ్నంగా నిరసన

నరసాపురం: మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళన నాలుగో రోజుకు చేరింది. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద అర్ధనగ్నంగా రిలేదీక్షలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏళ్ల తరబడి వెక్కిచాకిరీ చేస్తున్నా కూడా మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల డిమాండ్లను పట్టించుకోవడం దారుణమని ఇంజినీరింగ్ కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో కోటిపల్లి కాశీ, ఎం.రత్నం, సీహెచ్ సత్యనారాయణ, ఫణి, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.త్రిమూర్తులు తనిఖీ చేశారు.

మున్సిపల్ కార్మికుల ప్రధాన డిమాండ్లు

- అవుట్ సోర్సింగ్‌లో పదేళ్లుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్‌గా లేదా కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలి.
- ఇంజనీరింగ్ విభాగంలో టెక్నికల్ ఉద్యోగులకు రూ. 29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ. 24,500 జీతాలు ఇవ్వాలి.
- షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
- ప్రతి సంవత్సరం జీతం ఐదు శాతం ఇంక్రిమెంట్ పెరిగేలా చర్యలు తీసుకోవాలి.
- హెచ్‌ఆర్ పాలసీ కల్పించాలి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి.
- సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతం ఇవ్వాలి. చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలి.
- రిటైర్మెంట్, చనిపోయిన, అనారోగ్యంపాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి.

సమ్మె విరమించం



మా సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ సమ్మె విరమించేది లేదు. కూటమి ప్రభుత్వం వస్తే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సమస్యలు పరిష్కరిస్తుందని ఆశపడ్డాం. ఇంతవరకూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. జీతాలు పెంచాలి. అలాగే మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. వాటిని వెంటనే అమలు చేయాలి.

– టంకాల గణేష్, వాల్ ఆపరేటర్, పాలకొల్లు

ఉద్యోగం పర్మినెంట్ చేయాలి



గత పదేళ్లుగా నాన్ టెక్నికల్ విభాగంలో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నాను. ఉద్యోగం పర్మినెంట్ అవుతుందని చాలా ఆశతో ఉన్నాం. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాము. కనీస వేతనం రూ. 25 వేలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే టెక్నికల్ ఉద్యోగులకు రూ. 29 వేలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

–మండెల శ్రీనివాస్ గోపి, వాల్ ఆపరేటర్, పాలకొల్లు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. పది ఏళ్లుగా పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతున్నాం. పర్మినెంట్ ఉద్యోగులకు కల్పించిన విధంగా మాకు కూడా 62 ఏళ్ల సర్వీసు పెంచాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు ఇవ్వాలి. ఆప్కాస్ రద్దు చేస్తే మమ్మల్ని పర్మినెంట్ చేయాలి.

– కోటి అంజనేయులు, అవుట్ డోర్ వర్కర్, పాలకొల్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం: పట్టణంలోని ప్రధాన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో ఒక పూట విద్యుత్ సరఫరా పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్టు నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈ కె. మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రాంతం, మూడుబొమ్మల సెంటర్, బస్టాండ్ ఏరియా, స్టేషన్‌పేట, అరుంధతిపేట, చినమామిడిపల్లి, జవదాలపేట, రుస్తుంబాధ, సరిపల్లి, రాయిపేట, హౌసింగ్‌బోర్డు కాలనీ, వీవర్స్‌కాలనీ, కొల్లాబత్తులవారిపేట, సికిలేస్కూల్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటలు నుంచి, మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: కాజ పడమర గ్రామంలోని 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేస్తున్న కారణంగా ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫర ఉండదని నరసాపురం ప్రాంతీయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధు కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాజ పడమర, కొంతేరు, అడవిపాలెం, కలగంపూడి, ఏనుగువానిలంక, బాడవ, గొంది, కొత్త నవరసపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని పేర్కొన్నారు.

నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలను చర్చిస్తామని స్పష్టం చేశారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వాలమర్రు పాఠశాలలో విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

పాలకొల్లు సెంట్రల్: సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.నవ్యజీవన్ అన్నారు. గురువారం మండలంలోని వాలమర్రు, అరట్లకట్ట పాఠశాలల్లో విద్యార్థులకు అతిసార వ్యాధిపై అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డా. నవ్యజీవన్ మాట్లాడుతూ ఎవరికైనా అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే మీకు దగ్గర్లో ఉన్న ఆశ లేక ఏఎన్‌ఎం లను సంప్రదించి వైద్య సహాయం పొందాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అంగర వేణుగోపాలకృష్ణ, గుడాల హరిబాబు, అంగర రవి, ఎంఎల్‌హెచ్‌పీలు యువతేజ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పీఎం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పాలకోడేరు: మండలంలోని గరగపర్రు గ్రామంలో జాయింట్ ఎల్‌పీఎంఎంలు పట్టాదారులుగా నమోదైన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు, రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో జాయింట్ ఎల్‌పీఎంలు ఎన్ని ఉన్నాయి? వాటి మీద తీసుకున్న చర్యలు గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 439 జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్నాయని, గ్రామంలో వారానికి రెండు రోజులు ప్రత్యేక క్యాంపులను నిర్వహించి సమస్యలను పరిష్కరించి, అర్హులైన వారికి అమ్మ ఒడి, అన్నదాత సుఖీభవ, ప్రభుత్వ పథకాలకు ఇబ్బంది లేకుండా సబ్ డివిజన్ చేయించాలని అన్నారు. అనంతరం గరగపర్రు గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని రేషన్ షాపు నెంబర్ 43 సంబంధించిన నిత్యవసర సరుకులను కార్డుదారుల ఇంటికి వెళ్లి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సర్వే ఇన్చార్జి అధికారి కె.శ్రీనివాసరావు, డివిజనల్ సర్వే అధికారి మల్లికార్జునరావు, మండల సర్వేయర్ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వీధి వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ శిక్షణ



వీధి వ్యాపారులకు ఫాస్టాక్ సర్టిఫికెట్లు అందిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి వ్యాపారస్తుడూ వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ కల్తీ లేని ఆహారాన్ని విక్రయించాలని ఫాస్టాక్ ట్రైనర్ యశోదా దేవి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ పార్టనర్ కేవీజీవీఎం ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్వహిస్తున్న, ఫాస్టాక్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యశోదా దేవి మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్థుడూ జాతీయ ఆహార భద్రత సంస్థ నియమాలను పాటించాలని అన్నారు. ప్రతి వ్యాపారికి వ్యాపార, ఫుడ్ లైసెన్స్‌తో పాటు పాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కూడా తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రైనింగ్ అనంతరం వ్యాపారస్తులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీజీవీఎం సౌత్ ఇండియా ఇన్‌చార్జ్ టి.సింధు, సి.మోహన్‌బాబు, జిల్లా టీం హెడ్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు, వి.దానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఆరోగ్యకర జీవితం



ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాలలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కే.బలరామరాజు



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

భీమవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా క్రమశిక్షణతో ఆరోగ్యకర జీవితం గడపాలని భీమవరం పట్టణ ఎక్సైజ్ సీఐ కే.బలరామరాజు అన్నారు. గురువారం స్థానిక ఆర్‌ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ×అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినం, ×నషా ముక్త భారత్ అభియాన్× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వికేజే ప్రసూన, కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి .అరవింద స్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాస్‌రావు, ఎల్. నరసింహారావు, ఎస్. లక్ష్మికాంతం , జి. ఉమామహేశ్వరి, డీవీవీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

భీమవరం: ×మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా, కలిగివున్నా, రవాణా చేసినా చట్టరీత్యా నేరమని, తీవ్రతను బట్టి శిక్షలుంటాయని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీ నారాయణ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 2వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, కళాశాల డైరక్టర్ పి.శ్రీనావాసరాజు, ప్రిన్సిపల్ ఎం.వేణు, ప్యానల్ న్యాయవాది పి.అంబేడ్కర్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జవ్వాది సత్యనారాయణ, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచనలు వెంటనే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జె ఎస్ వి గోపాలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారి తోట సుందరయ్య భవనంలో రాజకీయ విజ్ఞాన తరగతులు రెండో రోజు శిక్షణ తరగతులు జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం షరతులకు లొంగిపోయి ఈ దేశ సంపదను ఆదానికి కట్టబెట్టడం కోసం స్మార్ట్ మీటర్లు విధానాన్ని తీసుకొచ్చిందని ఆయన విమర్శించారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు బిగించాలనే ఆలోచన మానుకోవాలన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే ప్రజలపై ఎటువంటి భారాలు వేయబోమని చెప్పి ప్రజలను దగా చేసిందని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలపై భారాలు వేస్తే రానున్న కాలంలో కూటమి ప్రభుత్వాన్ని ఇంటికి ప్రజలు సాగ నంపుతారని పేర్కొన్నారు.

వినియోగదారుల మండలిలో సభ్యత్వం తీసుకోవాలి

యలమంచిలి: ప్రతి ఒక్కరూ తమ వస్తువుల రక్షణకు వినియోగదారుల మండలిలో సభ్యత్వం తీసుకోవాలని వినియోగదారుల మండలి పాలకొల్లు శాఖ కార్యదర్శి ముచ్చర్ల వీరాస్వామినాయుడు కోరారు. యలమంచిలి మండలంలోని పలు గ్రామాలలో గురువారం ఆయన పలువురికి సభ్యత్వం జీసుకుంటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ, పౌర సరఫరాల శాఖ ఆదేశానుసారం ప్రతి ఏడాది జూన్ 27 నుంచి 30 వరకు సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు పూర్తి చేసి ఆధార్ కార్డు జత చేసి పాలకొల్లు గజలక్ష్మీ సెంటర్‌లో ఉన్న వినియోగదారుల మండలి కార్యాలయానికి రావాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 94902 79387 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వాటర్ ప్లాంట్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పెనుమంట్ర: మండలంలోని నెగ్గిపూడి గ్రామపంచాయతీ పరిధిలోని నూతన సచివాలయ భవనంలో ఇయర్‌బ్యాక్ కంపెనీ రూ. 7.5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను, రూ 14:30 లక్షల భయంతో నిర్మించిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇయర్ బ్యాక్ కంపెనీ మేనేజర్ సత్యనారాయణ, పూర్ణ సాయి ఆక్వాఫీడ్స్ అధినేత తాడి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మామిడి శెట్టిధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

యలమంచిలి: విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు సుమారు రూ.6 వేలు విలువ చేసే నోట్ బుక్స్ గురువారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిలుకూరి పద్మశ్రీ దేవి, వాకర్స్ క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను వాడితే భవిష్యత్ నాశనం



నరసాపురం: కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి గంగరాజు



పెనుమంట్ర: మార్టేరులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, విద్యార్థులు



పాలకొల్లు సెంట్రల్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

నరసాపురం: మాదకద్రవ్యాల వాడకం భవిష్యత్‌ను నాశనం చేస్తుందని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు అన్నారు. వైఎన్ కళాశాలలో గురువారం కళాశాల ఐక్యూసీసెంటర్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్, మండల న్యాయసేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో జడ్జి గంగరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం డ్రగ్స్ వాడకం విపరీతంగా పెరగడం ఆందోళన కలిగిస్తున్న అంశమన్నారు. విద్యార్థులు ఈ మహమ్మారి జోలికిపోకూడదని చెప్పారు. టౌన్ సీఐ బి.యాదగిరి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, వైస్ ప్రిన్సిపాల్ బెజవాడ వెంకటరత్నం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మార్టేరులో

పెనుమంట్ర: మాదక ద్రవ్యాల నిర్మూలన నేటితరం విద్యార్థుల చేతుల్లో ఉందని, అందుకు విద్యార్థులంతా నడుం బిగించాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం మార్టేరు జంక్షన్ వద్ద ఆచంట నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, నిర్మూలల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్తు అందించాలన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాలకొల్లు సెంట్రల్: యువత మత్తు పదార్థాలకు బానిసలై అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసులు నిర్వహించిన అవగాహనా ర్యాలీకి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ సరదాల కోసం చెడు అలవాట్లకు బానిసలై మీ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ కోలా రజనీకుమార్, రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు, ఎస్సై పృథ్వీ, సురేంద్ర, ఏఎస్సై మార్‌లింగం , మద్దాల శివాజీ తదితరులు పాల్గొన్నారు.